# మహాయోగి.. ధర్మమూర్తి




-సామవేదం షణ్ముఖ శర్మ

***అది శ్రీ శివానందమూర్తి సద్గురువుల అమృతోత్సవ సమయం. అంటే -75వ పుట్టినరోజు. వరంగల్‌లో గురుధామ్‌లో వైభవంగా జరుగుతోంది.***

***ఆ సమయంలో కొడవలూరు సిద్ధులగుట్టలో భాగవత ప్రవచనం పూర్తి చేసుకొని - ఎలాగైనా గురువుగారిని దర్శించాలని వరంగల్ బయల్దేరాను. చేరేటప్పటికి రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఈ సమయంలో గురుదర్శనం అవుతుందా? దానికి తోడు - బాగా ఆకలి వేస్తోంది. అక్కడ భోజనం దొరుకుతుందా? పైగా - నాలాంటి ఛాందసుడికి తగిన భోజనం లభ్యమౌతుందా? ఈ ఆలోచనలతో చేరాను.***

కేవలం గురుధ్యానం దారి పొడుగునా సాగుతూండగా ఆ రాత్రి చేరాను. చిత్రం గురువుగారు ఒక గదిలో ఉన్నారు. సరిగ్గా ప్రాంగణంలో ప్రవేశించేసరికి - గురువుగారి దగ్గర నుండి రమ్మనమని కబురు వచ్చింది.

ఆశ్చర్యంతో లోపలికి వెళ్లాను. 'ముందు భోంచేయి' అని, ఒక గదిలో చక్కని భోజనం పెట్టించారు.


తరువాత వారి సమక్షంలో కూర్చున్నాను. గురువుగారిలోని దివ్యత్వం అంతకు మునుపు అనేక సంఘటనల్లో నాకు అనుభవమున్నా, ఆ రోజు మరొకసారి మహాద్భుతంగా అనుభవానికి వచ్చింది.

కరుణార్ద్రమైన గురువుగారి చూపుల నీడ, వారి చిరునవ్వు చల్లదనపు ఛాయలో కూర్చున్నాక - మెత్తగా పలకరించి - 'ఈ ఉపాధికి 75 ఏళ్లు రావడం విశేషం కాదు. దాన్ని నిమిత్తం చేసుకొని దేశం కోసం, ధర్మం కోసం క్రతువులు నిర్వహించడం జరిగింది' - అన్న వారి మాట నేటికీ స్ఫురిస్తూనే ఉంటుంది.

నిస్సంగుడైన జీవన్ముక్తుడు, మహా యోగి కేవలం దేశ- ధర్మ క్షేమం కోసం ఉపాధిని స్వీకరించారు. ఆ ఉపాధి ద్వారా తన తపశ్శక్తిని ప్రసరిస్తూ, లోకక్షేమానికై క్రతువులు, సంకల్ప దీక్షలు చేశారు, చేయించారు.

ధర్మరక్షణ చేయడంలో మహాత్ముల ప్రణాళికలు అనేక రకాలుగా ఉంటాయి.





సద్గురు శివానందమూర్తిగారితో సామవేదం షణ్ముఖశర్మ

1.ధర్మ ప్రచారం, 2.అధర్మాన్ని సహేతుకంగా ప్రతిఘటించడం, 3.తపోబలం, దైవ బలం వాతావరణంలో నింపి, దుష్టశక్తుల్ని తరిమికొట్టి, పంచ భూతులకు శక్తినీ, ధర్మానికి పుష్టినీ అందించడం.

ఈ మూడు తన జీవితంగా గడిపిన మహాయోగి సద్గురువులు.

⁘ సనాతన ధర్మభూమి అయిన భారతావనిలో శాస్త్రాలు, కళలు, కట్టడాలు, పరంపర, నాగరికత, సంస్కృతి... వీటన్నిటి పరిరక్షణ ఆవశ్యక కర్తవ్యం, అపారమైన తపస్సంపాదిత జ్ఞానంతో ఈ మహత్కార్యాన్ని వారు నిర్వహించిన తీరు అద్వితీయం.

⁘ మన సంస్కృతిపై వచ్చిన అపోహలకు, కువిమర్శకులకు యుక్తితో, శాస్త్రీయమైన తర్కబలంతో రచనల ద్వారా, వచనాల ద్వారా వారిచ్చిన సమాధానాలు ఎన్ని అజ్ఞానపు చీకటి పొరలను పటాపంచలు చేశాయో!

⁘ మౌనంగా - వారు నిరంతరం ఏదో యాగం, ఏదో చోట చేస్తూ, చేయిస్తూ వాతావరణంలో దివ్యశక్తిని ప్రసరింపజేయడం మహాద్భుతం!

ఈ దేశానికి శక్తి, విద్య, సంపద, సమృద్ధిగా లభింపజేయాలని ఆ మూడింటి సమైక్యతత్త్వమైన 'ఆద్యాలక్ష్మి' ఆలయాన్ని మంత్ర - తంత్ర శాస్త్ర మర్యాదలతో రమణీయ ఉత్కళ శిల్పాగమ సంప్రదాయ రీతిలో 'ఆనందవనం'లో నిర్మించారు. ఒక అనితరసాధ్యమైన మహాద్భుత కార్యాన్ని ఎంత నిశ్శబ్దంగా, ఎంత ప్రగాఢంగా, ప్రభావవంతంగా చేశారో - అది అనితర సాధ్యం. ఆ ఆలయ నియమాలలోనే నాటి వైదిక ఋషుల ఆదర్శం ద్యోతకమౌతుంది.



ఒక పవిత్ర నియమబద్ధ జీవనం ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందో తెలియాలంటే - శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, రమణ మహర్షి, కంచి మహాస్వామి వంటి వారి వలెనే సంచరించిన సద్గురు శివానందమూర్తి గారి జీవితాన్ని తెలుసుకోవాలి.

★★★

వారి నుండి కోపాన్ని నేను రెండు మార్లు చూశాను.

ఒకటి - హైదరాబాద్ వారు వచ్చినప్పుడు, దర్శనానికి వెళ్లాను. అప్పుడు నుదుట విబూది పెట్టారు. 'విదేశాల్లో ముప్ఫయి పైన హిందూ ఆలయాల్లోంచి శివలింగాలని తీయించారు. శివుని పూజించవద్దని ప్రచారం చేస్తున్నారు. శివ ద్వేషాన్ని చెబుతూ వైష్ణవులు చెలామణి అవుతున్నారు. వాటిని ప్రతిఘటించాలి. భేదభావాల్ని పోగొట్టాలి. సమగ్రంగా సనాతన ధర్మాన్ని సమైక్యతతో సామరస్యంతో నిలపాలి. ఆ పనికి పూనుకో. నీకు భగవంతుడు వేదికనిచ్చాడు. నీకు నా అనుగ్రహముంది' అని అన్నప్పుడు అధర్మంపట్ల వారికున్న ఆగ్రహం నృసింహ తేజంలా వారి కనులలో కనపడింది.

'శివ - కేశవా - గణేశ - స్కంద - శక్తి - సూర్యాది భేదాలన్నీ ఒకే తత్వపు బహురూపాలు...' అంటూ వారు వివరించిన తీరు విశాల సనాతన ధర్మపు ఔన్నత్యానికి సాక్షాత్కారం.

రెండవ ఘట్టం.. హైదరాబాద్‌లోనే. ఆ రోజున కంచి స్వామి వారిని కుట్రతో అరెస్ట్ చేసిన రోజు. అందులో కేవలం మన ధర్మంపై దెబ్బ తీయడమే ప్రధానోద్దేశమని విజ్ఞులకు తెలుస్తోంది. కానీ చాలామంది అది గుర్తించక కనీస స్పృహ లేకుండా ఉన్నారు.

'గురువుగారూ! ఏమిటిలా జరిగింది?' అంటూ వణుకుతున్న గొంతుతో ప్రశ్నించాను.

'ఈ జాతి నిద్రపోతోందనడానికి ఇదో ఉదాహరణ' అని పలికిన గురువుల కన్నులలో ఆగ్రహ రేఖలు చూసి భయచకితుడ్నయ్యాను. ఈ అధార్మిక ఘట్టాన్ని వారు ఎదుర్కొన్న తీరు, అనేక హిందూ పీఠాధిపతులతో మాట్లాడిన విధానం, తన తపశ్శక్తితో వినూత్న విధానంతో చైతన్యాన్ని కలిగించిన రీతి.. మరువలేనిది.

తన ఆగ్రహం అధర్మంపై! తన ప్రేమ దేశంపై! తన దృష్టి ధర్మంపై! తన జీవితం, శ్వాస దేశం - ధర్మం!

వారు నడుస్తున్న భారతీయ సనాతన ధర్మం! తనకంటూ వ్యక్తిగత జీవితం - స్వార్థం నలుసంత కూడా మిగలని దేశ ధర్మాంకిత జీవనులు!

ఎప్పుడైనా మనస్సు గాడి తప్పితే వారి ధ్యానం తిరిగి సుస్థితిలో నిలబెడుతుంది! వారిని స్మరిస్తూ, వారే స్ఫురిస్తూ సాగుతున్న జీవితంలో అనుభవాలు ఎన్నెన్నో!

దేశానికీ ధర్మానికీ అంకితమై ఎలా శ్రమించాలో, ఏం చేయాలో నేర్పి, స్ఫురింపజేసి, చేయిపట్టి నాడూ నేడూ నడిపిస్తున్నది వారేనని నా విశ్వాసం!

★★★

1998-99 మధ్యకాలంలో చెన్నైలో ఉంటున్నప్పుడు, శ్రీ రాఘవన్ గారి ఇంట్లో ఉదయం 6.30కి వచ్చి గురువుగారిని కలవవచ్చు అని శ్రీ చల్లా విశ్వనాథశాస్త్రి గారు చెప్పారు.



అప్పటికింకా నాకు గురుదేవులతో మాట్లాడే అవకాశం దొరకలేదు... వినడం - కొన్ని సభల్లో చూడటం తప్ప. రేపు పొద్దున కలవవచ్చు అనే మాటకి ఆ రాత్రంతా ఉత్సాహంతో నిద్రలేదు. కానీ ఊరుకోకుండా ఒక మిత్రునితో ఈ వార్త చెప్పాను. 'పొద్దునే మా ఇంటికి రండి. ఇద్దరం కలిసి వెళదాం. నాకు గురువుగారు వ్యక్తిగతంగా సన్నిహితులే' అని చెప్పారు ఆ మిత్రులు.

కాదనలేక మిత్రుడింటికి 5.30కి చేరుకున్నాను. అప్పటికి నేను వ్రాసిన 'శివపదం' సంకీర్తనల పుస్తకంతో. సద్గురువులు శివస్వరూపులు. వారికి ఒకటి - రెండు కీర్తనలు వినిపించాలి - అనే భావంతో ఉన్నాను.

కానీ నా దురదృష్టం ఆ మిత్రుడు తన వ్యక్తిగత పనుల్లో మునిగి, తాత్సారం చేసి 9.30కి బయల్దేరదీశాడు. అంతసేపూ నాలో ఆందోళన పెరుగుతూనే ఉంది. విధిలేక సహించాను.

మొత్తానికి గురువుగారి దగ్గరికి వెళ్లేటప్పటికి - పది గంటలు దాటింది. గురువుగారు ముఖ్య శిష్యులతో భోజనానికి కూర్చున్నారు. చల్లా వారు నన్ను ఆత్మీయంగా మందలించారు. చేసేదేమీ లేక గురువుగారికి నమస్కరించి ఊరుకున్నాను. నా మిత్రుడు మాత్రం - తాను వ్రాసిన రచనలు భోజనం చేస్తున్న గురువుగారి వద్దనే చదువుతూ కూర్చున్నారు. గురువుగారు దీవించారు. నేను- అది అసందర్భం అనిపించి - ఏమీ మాట్లాడకుండా, కేవలం నమస్కరించి, ప్రసాదం తీసుకొని, మౌనంగా నా 'శివపదాల'తో వెనుదిరిగాను. ఆశాభంగంతో కొన్నాళ్లు బాధపడ్డాను.

తన ఆగ్రహం అధర్మంపై!
తన ప్రేమ దేశంపై!
తన దృష్టి ధర్మంపై!
తన జీవితం,
శ్వాస దేశం - ధర్మం!
వారు నడుస్తున్న
భారతీయ సనాతన
ధర్మం! తనకంటూ
వ్యక్తిగత జీవితం -
స్వార్థం నలుసంత కూడా
మిగలని దేశ ధర్మాంకిత
జీవనులు!




కొన్నేళ్ల తరువాత- విశాఖపట్నంలో ఒక సంస్థ వారు 'శివపదం' కచేరీ ఏర్పాటు చేశారు. నా వ్యాఖ్యానంతో ప్రసిద్ధ గాయకుల గానం. అంతా ఏర్పాటయ్యాక ఆహ్వాన పత్రం ముద్రించాక నాకు పంపారు. ఆశ్చర్యపోయాను. 'ముఖ్య అతిథి - సద్గురు శ్రీ శివానందమూర్తిగారు' అన్న వాక్యం చూసి ఆశ్చర్యం కలిగింది. 'గురువుగారు వస్తున్నారా?' అని ప్రశ్నించాను. 'అవును. కానీ ఒక్క పది నిమిషాలే ఉంటారు అని వారి కార్యదర్శులు చెప్పారు' అన్నారు నిర్వాహకులు.

'పోనీ! ఒకటి రెండైనా శివపదాలను శివునికి వినిపించవచ్చు' అనుకున్నాను.

సభ ప్రారంభమయింది.

గురువుగారు శిష్య బృందంతో వచ్చారు. బృందం చెబుతూనే ఉన్నారు - 'కొద్దిసేపే ఉంటారు' అని.

కానీ ప్రారంభం నుండి చివరి వరకు రెండున్నర గంటలు గురువుగారు కూర్చునే ఉన్నారు. దాదాపు 18 పాటలు, వ్యాఖ్యానం విన్నారు. నా ఆనందం భౌతిక సీమలు దాటి, కైలాసానికి చేరుకుంది.

కార్యక్రమం పూర్తవగానే వారి పాదాలపై వాలిపోయాను. రెండు చేతులతో భుజాన్ని పట్టిలేపి 'తృప్తోస్మి' అని దీవించారు.

హృదయంలో మౌనాకాంక్షను కూడా గ్రహించి, ఆశించిన దానిని మించి అనుగ్రహించడమంటే ఇంతకంటే మరొక ఉదాహరణతో చెప్పగలమా!

★ ★ ★


భీమిలి ఆనందవనంలోని ఆద్యాది శ్రీమహాలక్ష్మి ఆలయ ప్రవేశద్వారం

2005, ఉగాది. విశాఖలో వేదిక్ సేవా ట్రస్ట్ వారి కార్యక్రమం అప్పటికి రెండేళ్ల నుండి ట్రస్ట్ తరపున శ్రీ చంద్రమౌళిగారు అడుగుతునే ఉన్నారు. నాకు సువర్ణ గండపెండేర సన్మానం చేయాలని, అంగీకరించమని! కానీ నాకు సన్మానమంటే భయం!

అందునా గండపెండేరం అనే మాట మరీ భయపెట్టింది. నేను వద్దంటూనే ఉన్నాను.

కానీ ఒకరోజు ఆనందవనంలో సద్గురు సమక్షంలో ఉండగా శ్రీ చంద్రమౌళిగారు అక్కడికి వచ్చారు, నన్ను ఒప్పుకొనమని గురువు ద్వారా చెప్పించాలని వారి ఉద్దేశం. 'ఈయన అంగీకరించడం లేదు. మీరైనా చెప్పండి' అన్నారు గురువుగారితో.

అప్పుడు గురువుగారన్న మాటలు 'కాదనడం కూడా అహంకారమే నాయనా! ఆశించకుండా, యాచించకుండా వచ్చిన దానిని తిరస్కరించడం ఎందుకు? నువ్వు సనాతన ధర్మం గురించి చెప్పడం వల్ల ఈ సన్మానం. ఇది సమాజానికి ధర్మంపై ఉన్న గౌరవానికి తార్కాణం. కాదనకూడదు' అన్నారు మందలిస్తూ.

గురువుగారి ఆజ్ఞను ఔదలదాల్చుతూ - నేనొక మాటన్నాను 'మీ సమక్షంలో, మీ ఆశీర్వాదంతో సభ జరిగితే సంతోషం'. ఇంతే నేనన్నది. గురువుగారు సరే అన్నారు.

ఆ సమయంలో మా నాన్నగారు కూడా ఉన్నారు.

సన్మాన సభలో నాన్నగారు, గురువుగారు ఇద్దరూ ఉండగా, వారు ఆశీర్వదించగా, శ్రీ పి.ఎస్.మూర్తి దంపతులు నాకు గండపెండేరం తొడిగారు.

గురువుగారు ఆ సభలో 'షణ్ముఖ శర్మంటే నాకు మిత్ర వాత్సల్యం' అని అన్న మాట నేటికీ నాలో ధ్వనించే మంత్రాశీస్సు. (ఐతే - ఇది స్వోత్కర్షతో కాక, కృపాసంకేతంగా భావించి వ్రాస్తున్న మాటగా గ్రహించవలసినదిగా పాఠకులకు మనవి.)

సభ అయ్యింది.

ఆ తరువాత విన్న కొన్ని వార్తలు నన్ను దిగులుకి గురి చేశాయి.

'గురువుగారి సమక్షం, ఆశీస్సు' అని నేనన్న మాటని వక్రీకరించి, 'గురువుగారు తొడిగితేనే నేను అంగీకరిస్తాను' అన్నానని ఒక దుష్ప్రచారం జరిగింది.

గురువుల చేత అలాంటి పని చేయించే పాప బుద్ధి ఊహలో కూడా లేని సంప్రదాయవాదిని నేను. నాకే కాదు ట్రస్ట్ నిర్వాహకులకు కూడా ఆ భావం లేదు. కేవలం వారి సన్నిధిలో, నిర్వాహకులు చేసే సన్మానమిది. కార్యక్రమ సరళి అది. కానీ దానిని గ్రహించక ఏ ఒకరిద్దరో తప్పుగా గ్రహించి, తప్పుడు ప్రచారం చేశారు.

ఇది తెలిసి, నేను భయపడ్డాను. వారంతా పొరపడినా ఫరవాలేదు. గురువుగారు అన్యథా భావించకపోతే చాలు అనుకున్నాను. కానీ వారికి ముఖం చూపించడానికి ధైర్యం చాలలేదు.

ఈ అపప్రచారాన్ని గురువుగారు నమ్మారు! అనే శంక! నేనన్న మాట పొరపాటుగా ధ్వనించిందా!

గురువుగారి అంతేవాసులలో ఒకరికి, ఉండబట్టలేక, నా మనఃక్షోభ వివరించాను. అతని ద్వారా - గురువుగారికి తెలిసింది.

'షణ్ముఖ శర్మను రమ్మను. అతడి మనసు నాకు తెలుసు. అతడేమన్నాడో నాకు స్పష్టంగా తెలుసు, ఇంకెవరి మాటా నేను నమ్మవలసిన అవసరం లేదు' అని కబురు పంపారు. పరుగు పరుగున వారి పాదాల చెంతకు చేరి నమస్కరించుకున్నాను. ఈ అపప్రచారాల వెనుక అసూయలో, అపోహలో ఏమైనా ఉండవచ్చు గానీ! సర్వజ్ఞులైన గురువులకు సత్యం తప్ప మరేదీ పట్టదని తెలిసింది. మనసు తెలిసిన మహాదేవునికి నమస్సులు.

అయితే ఈ సంఘటన తరువాత సన్మానాలకి మరింత దూరం ఉండాలనే నిశ్చయం బలపడింది. వారి రక్షణ ఉంది కనుక తట్టుకోగలిగానే కానీ, లేని పక్షంలో పెద్ద దెబ్బ మిగిలేది!

కొంతకాలం తరువాత - చేతికి కంకణం తొడుగుతూ 'నీకు మృత్యుంజయ రక్ష' అన్న సద్గురువుల వాత్సల్యం నేటికీ నాకు ఊపిరి.

వారు మలచిన జీవితం వారి స్మరణతో, స్ఫురణతో సాగడం కంటె పరమార్థమేముంది!

(మనవి: ఇంతవరకూ గతంలో వ్రాసిన వ్యాసాలలో వ్యక్తిగత అనుభవాలు రాయలేదు. కానీ మిత్రులు, మహాత్ములు ఎం.వి.ఆర్. శాస్త్రిగారిచ్చిన చనువుతో, ఈ అనుభవాలు చెప్పాల్సిన అవసరముందనిపించి వ్రాయవలసి వచ్చింది.)

★

-ఫొటోలు: గొల్లపూడి రవి



కాదనడం కూడా అహంకారమే నాయనా! ఆశించకుండా, యాచించకుండా వచ్చిన దానిని తిరస్కరించడం ఎందుకు? నువ్వు సనాతన ధర్మం గురించి చెప్పడం వల్ల ఈ సన్మానం. ఇది సమాజానికి ధర్మంపై ఉన్న గౌరవానికి తార్కాణం అన్నారు గురువుగారు.

# ఆదర్శ గురువు

**పూ**జ్య సద్గురు కందుకూరి శివానందమ్మూర్తిగారి శివసాయుజ్యంతో భారతీయ ధార్మిక ఇతిహాసంలో ఒక అపురూప ఉజ్వల ప్రకరణం ముగిసింది. ఆరు దశాబ్దాలపాటు ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, ప్రజాజీవన, సేవా రంగాల్లో లక్షల మందిని ప్రభావితులను చేసి ధర్మ మార్గాన నడిపించి, విలక్షణ పౌరులుగా తీర్చిదిద్దిన ఒక దివ్యశక్తి చరిత్రాత్మక జీవనయాత్ర చాలించింది. భారతజాతి ఒక మహా దేశికుడిని, గొప్ప దేశభక్తుడిని, తన ఉనికి చేతనే జగతికి దీవెనలందించిన ఒక మహాపురుషుడిని కోల్పోయింది. శివానందమూర్తిగారి మహాభినిష్క్రమణం ధార్మిక రంగం బహుశా ఏనాటికీ పూడ్చుకోలేని వెలితి.

వేదయుగం నుంచి నేటి దాకా ఎందరో యోగులు, పెద్దలు, సద్గురువులు, అవతార పురుషులు, మహాజ్ఞానులు, మహాద్రష్టలు కోరిన వారికి కొంగుబంగారమై, సాధకులకు బోధకులై, చేయిపట్టి తీరం దాటిస్తూనే ఉన్నారు. సర్వకాలాల్లో ఆధ్యాత్మిక రంగాన్ని సుసంపన్నం చేసిన మహనీయులు లెక్కకు మిక్కిలే అయినా సద్గురు శివానందమూర్తితో పోల్చదగిన మహత్తు మనకు తెలిసిన వేల ఏళ్ల భారత దేశ చరిత్రలో మరొకటి కానరాదు. బ్రహ్మజ్ఞానాన్ని లోకజ్ఞానంతో మేళవించి.. మనుష్యుడికి మొట్టమొదట కావలసింది ప్రపంచ జ్ఞానమని ప్రబోధించి.. దేశక్షేమాన్ని కాంక్షించి, దేశం కోసమే, తపించి.. దేశభక్తులను, ధర్మవీరులను తయారుచేయడమే పనిగా పెట్టుకుని.. దేశ రక్షణకు, జనహితానికి, అమోఘంగా, అజ్ఞాతంగా నిస్వార్థంగా అనవరతం పాటుపడుతూ, భారతజాతి అభ్యున్నతి కోసం, సనాతన ధర్మ సంరక్షణ కోసం, నిశ్శబ్దంగా, ప్రతిఫలాపేక్ష రహితంగా విరామమెరుగక పరిశ్రమించిన శివానందమూర్తిగారి వంటి ఆధ్యాత్మిక శిఖరాన్ని భారతజాతి మున్నెన్నడూ ఎరుగదు.



పైసా పనిచేసి పదివేల రూపాయల ప్రచారం ఆశించే మనుషులు కొల్లలుగా ఉన్న ఈ రోజుల్లో పది లక్షల రూపాయల పనిచేసి పైసా ప్రచారాన్ని కూడా ఆపేక్షించని మహనీయుడు శివానందమూర్తిగారు. వెయ్యి పున్నములను కొన్నేళ్ల కిందే దాటిన సుదీర్ఘ జీవన యానంలో ఆయన మూడో కంటికి తెలియకుండా ఎన్ని గుప్తదానాలు చేశారో, ఎటువంటి మహత్కార్యాలు చేశారో, ఏఏ రంగాల్లో ఏఏ రీతుల్లో అజ్ఞాతంగా ఎన్నెన్ని సేవలందించారో, దేశరక్షణకు సొంత ఖర్చుతో ఎన్ని యజ్ఞాలు చేయించారో, పూర్తిగా తెలిసినవారు బహుశా ఎవరూ లేరు. పిలిస్తే పలికే దైవంలా నమ్ముకున్న భక్తులకు ఆపదలు బాపేందుకు ఆయన చూపిన మహిమలు పైకి చాటుకోవడం ఆయనకు సుతరామూ ఇష్టం ఉండేది కాదు. లేని శక్తులు ఉన్నట్టుగా భ్రమగొలిపి, జనాకర్షణ, ధనాకర్షణలకు పాల్పడే కపట జీవులు కొల్లలుగా ఉన్నకాలంలో తన మహత్తును సాధ్యమైనంత వరకు పరుల కంటపడకుండా తనలోనే దాచుకుని, సాదాసీదా గృహస్థుగా జీవితం గడిపిన వాడాయన. గృహస్థాశ్రమంలోనే ఉంటూ పరమహంస పరివ్రాజకులైన జగద్గురుల చేతనే వందనాలందుకున్న మహాజ్ఞాని, ప్రత్యేకంగా ఏ గురువూ లేకుండా పుట్టుక నుంచే ఆత్మజ్ఞానం కలిగిన మహాయోగి శివానందమూర్తిగారు.

సంపన్న జమిందారీ కుటుంబంలో పుట్టినా భోగభాగ్యాలను తృణప్రాయంగా భావించి, కట్టుబట్టలతో విశాల జనజీవితంలోకి అడుగుపెట్టిన అపర సిద్దార్థుడు శివానందమూర్తిగారు. పోలీసు కొలువులో మధ్యస్థాయి కార్యాలయ ఉద్యోగిగా పనిచేస్తూనే పోలీసు శాఖలో ఉన్నతస్థాయిగల తన పై అధికారులచేత పాదాభివందనాలు చేయించుకున్నవాడాయన. సంగీత, నాట్య శాస్త్రాలను, పుక్కిట పట్టి కొమ్ములు తిరిగిన మహా సంగీత విద్వాంసులకు, మహా నాట్యకారిణులకే ఆయా విద్యలలో వారు కలనైనా ఊహించని మెలకువలను నేర్పించగలిగిన మహా మహోపాధ్యాయుడాయన. ప్రపంచంలో ఏ రంగంలోని నిష్ణాతులతోనైనా పది నిమిషాలు ముచ్చటిస్తే చాలు ఆ రంగంలో వారికి ఏనాడూ తోచని కొత్త కోణాలు స్ఫురింపజేయగల్గిన నడిచే విజ్ఞానసర్వస్వం ఆయన. కాలేజీ విద్యార్థిగా గురుగోల్వాల్కర్ నుంచి నేరుగా స్ఫూర్తి పొంది, సామాన్య స్వయంసేవకునిగా పని చేసిన శివానందమూర్తిగారు కాలక్రమంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌కి మార్గదర్శకుల్లో ఒకరుగా, మొత్తం హిందూ సమాజానికి, పెద్దదిక్కుగా భాసిల్లారు. సనాతన ధర్మ పునరుజ్జీవనానికి, భారతజాతి పునర్వైభవానికి ఆర్ష సంస్కృతి పునరుత్థానానికి జీవితమంతటినీ అంకితం చేసి, దేశాన్ని కమ్మిన అసుర శక్తుల పీడను విరగడ చేయడానికి శివానందమూర్తిగారు తన యావచ్ఛక్తినీ, తనకున్న తపోబలమంతటినీ ధారబోశారు. నిరుటి సాధారణ ఎన్నికల సమయంలో మంచం మీద కాలు కదిలించలేని నిస్సహాయ స్థితిలో ఉండి కూడా ఎవరికీ చెప్పాపెట్టకుండా తలచిందే తడవుగా దిగ్గున బయలుదేరి ఆయన కాశీ విశ్వనాథాలయానికి వెళ్లి, అన్నీ ఎవరో అమర్చిపెట్టినట్టుగా అక్కడ ప్రత్యేక పూజలు కావించి, మైళ్లదూరం చకచక నడిచి గంగాస్నానం చేసి, సమాజ క్షేమం కోసం దైవశక్తిని ఆవాహన చేసిన తీరు ఎవరికో తప్ప తెలియదు. పశ్చిమతీరం వలె, తూర్పు తీరం కూడా, వైభవంతో విలసిల్లి, ఉత్తరాంధ్రకు మహర్దశ పట్టాలన్న మహాసంకల్పంతో ప్రపంచంలో కనీవినీ ఎరుగని రీతిలో భీమిలి ఆనందవనంలో సొంత ఖర్చుతో ఆద్యాది మహాలక్ష్మి ఆలయాన్ని నిర్మించి, పూర్తిగా సొంత వనరులతో దాన్ని నిర్వహిస్తున్న వైనం ఎరిగినవారు ఆయన ప్రణాళికా నైపుణ్యాన్ని, కార్యదక్షతను, నిస్వార్థ త్యాగ నిరతిని మెచ్చుకోకుండా ఉండలేరు. తాను మహాశైవ పీఠానికి అధిపతి అయి కూడా శివకేశవ అభేదాన్ని నొక్కిచెబుతూ శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఏటేటా మహా వైభవంగా నిర్వహిస్తూ, ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, అకాడెమీలు సైతం ఆశ్చర్యపడే రీతిలో వివిధ రంగాల ప్రతిభామూర్తులను ఆయా సందర్భాల్లో సత్కరించడం ఆయనకే చెల్లింది.

అర్జీ పెట్టనిదే గౌరవ డాక్టరేటు, పైరవీ చేయనిదే పద్మశ్రీ అయినా రాని ఈ కాలంలో వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను ఏనాడో చూపించిన విశిష్ట వ్యక్తులను వెతికి పట్టుకుని, లక్ష రూపాయల పైచిలుకు భూరి బహుమానాన్ని, ప్రతిష్ఠాత్మకమైన శివానంద ఎమినెంట్ సిటిజన్ అవార్డును దయచేసి స్వీకరించవలసిందని ఏటేటా వినమ్రంగా పిలువనంపిన ఆదర్శమూర్తి శివానందమూర్తిగారు. తాను వేదవేదాంగాలను కాచివడబోసి, సనాతన ధర్మానికి పట్టుగొమ్మలా నిలిచిన హైందవ ధర్మాచార్యుడు అయి కూడా తన చిరకాల నివాసమైన భీమునిపట్నంలో చర్చిలకు, మసీదులకు సైతం విరాళాలిచ్చి, అన్ని మతాలవారినీ సమానంగా ఆదరించి సర్వధర్మ సమభావనకు ప్రతిరూపంగా నిలిచిన విశిష్ట వ్యక్తి ఆయన. వైదిక విద్యల్లో, యోగసాధనలో, ఆధ్యాత్మిక చింతనలో, మహామహులకు సైతం మార్గదర్శనం చేయగలిగిన 'గురువుగారు' సామాన్యుల్లోకెల్లా సామాన్యులకు సైతం వారి స్థాయికి దిగి వచ్చి జ్ఞానబోధ చేయగలిగిన మనీషి. కఠయోగానికి ఎంత గహనమైన వ్యాఖ్యానం చేసి, కాలచక్ర గతిని ఎంత లోతుగా కళ్లకు కట్టించారో, మహర్షుల చరిత్రలను అంత సరళంగా పాఠక జనానికి సైతం బోధ పరచగలిగిన మహా రచయిత ఆయన. సద్గురు శివానందమూర్తిగారు భౌతిక జీవన ప్రస్థానం చాలించినా జిజ్ఞాసువులను, దేశభక్తులను, ధర్మనిబద్ధులకు గురుమూర్తిగా కలకాలం నిలిచే ఉంటారు. త్రైలింగస్వామి, నృసింహ సరస్వతి, రమణ మహర్షి వంటి మహనీయుల కోవకు చెందిన ఈ ఆధునిక యోగీశ్వరుడి దివ్యస్మృతికి ఆంధ్రభూమి నివాళి.

***'ఆంధ్రభూమి' సంపాదకీయం***

***-11, జూన్ 2015***



# ఆయన నాకు ఏమవుతారు?



-ఎం.వి.ఆర్. శాస్త్రి

***గురువుగారు లేకుండా అప్పుడే ఏడాది గడిచింది. ఇంటా బయటా ఏ సమస్య వచ్చినా గురువుగారికి చెప్పుకుంటే తీరిపోతుంది; ఏ చిక్కునైనా ఆయనే విప్పాలి; ముఖ్యమైన ఏ నిర్ణయమైనా ఆయనే చేయాలి; ఎప్పుడు ఏ అవసరం వచ్చినా ఒక ఫోన్ చేస్తే చాలు; అన్నిటికీ ఆయనే ఉన్నారు - అన్న భరోసాతో ఇన్నాళ్లూ ధీమాగా బతికేశాం.***

***ఆ లగ్జరీ ఇప్పుడు లేదు. ఆ ప్రివిలేజి మరి రాదు.***

'మాకైతే తేడా లేదు; ఆయన లేరన్న లోటే కనిపించటం లేదు; ఇప్పుడూ వెంటే ఉంటున్నారు; తలచుకోగానే బదులిస్తున్నారు; ఇదివరకు లాగే అన్నీ దగ్గరుండి జరిపిస్తున్నారు' అంటున్నారు గురు పరివారంలోని కొందరు పుణ్యాత్ములు. ఆ మాటలు వింటే అసూయ కలుగుతున్నది. నాకైతే అంత పరిణతిలేదు; అంతటి అదృష్టమూ లేదు. ఆయన లేని లోటు నాకు కొట్టొచ్చినట్టు కనపడుతున్నది. ఆయన్ని నేను చాలా చాలా మిస్సవుతున్నాను. ఈ మాట ఒప్పుకోవడానికి నాకు ఎలాంటి సంకోచమూ లేదు.



ఇంతకీ సద్గురు శివానందమూర్తి గారు ఎవరు? నాకేమవుతారు? ఆయనతో నా అనుబంధం ఎలాంటిది? ఏనాటిది? ఎంతకాలం ఉంటుంది? నాకు తెలియదు. ఆయన దేవుడు అని చాలా మంది భక్తులకు ఉన్న ప్రగాఢ విశ్వాసం నాకు లేదు. ఎందుకంటే ఆయన నాకు తెలియడానికి ముందే నేను దేవుడి ప్రభావంలోకి వచ్చాను. ఇరవయ్యేళ్ల పైగా ఆయన సాన్నిహిత్య భాగ్యం అనుభవించినప్పుడూ ఆయన వేరు; దేవుడు వేరు అనే అనుకున్నాను. అలా అనుకోమనే ఆయన చెప్పేవారు. ఆయనతో మాట్లాడవలసినవి ఆయనతో, దేవుడికి చెప్పుకోవలసినవి దేవుడితో విన్నవించేవాడిని. (ఒక్కోమారు దేవుడిని అతిరహస్యంగా అడిగిన దానికి ఈయన నుంచి జవాబు వస్తే కాస్త తికమక పడేవాడిని.) ఆయన కనుమరుగు అయ్యాకా దేవుడి చానల్ దేవుడి దయ వల్ల బాగానే ఉండటంవల్ల దైవికమైన దిగులు అయితే లేదు.


**జాగేశ్వర్‌లో (?) అర్ధరాత్రి గుడి పూజారికి శివుడిలా సాక్షాత్కరించిన వాడు... కురుక్షేత్రంలో గీతాబోధ జరిగిన చోట నిలబడి 'ఇక్కడే అంతా చెప్పాను' అని పలికిన వాడు... అయోధ్య శిథిలాల ఎదుట గోడకు చేరగిలబడి 'ఆరు వేల ఏళ్లుగా చూస్తున్నా' అని నాతో నిర్వేదంగా అన్నవాడు దేవుడో, దేవ సమానుడో, కనీసం దైవాంశ సంభూతుడో కాడా?**

పోనీ - గురువుగారు నిజంగా నాకు గురువుగారా? అలా చెప్పుకునే అర్హత, యోగ్యత నాకు ఉన్నాయా? ఆయన నాకు విద్య నేర్పారా? ఉపదేశం చేశారా? మంత్రం ఇచ్చారా? ఆయనకు నేను శుశ్రూష చేశానా? కనీసం ఆయనను పూర్తిగా నమ్మానా? ఆయన చెప్పినట్టుగా నడిచానా? ఆయన చెప్పినదాన్ని, చేస్తున్న దాన్ని సందేహించటం మానానా? అనుమానాలు, అభ్యంతరాలు, అపనమ్మకాలు లేకుండా ఆయన పలికినదే, ఉపదేశించినదే, ఆదేశించినదే తిరుగులేని సత్యమని, వేదవాక్యమని త్రికరణశుద్ధితో ఏనాడైనా నమ్మానా? శంకలూ, తర్కాలూ కట్టిపెట్టి పరిపూర్ణ విశ్వాసంతో ఆయనకు సరండర్ అయ్యానా?

అన్నిటికీ సమాధానం ఒక్కటే: లేదు... లేదు... లేదు.

బహుశా అందువల్లే ఆయనతో సిసలైన గురు - శిష్య సంబంధానికి నేను నోచుకోలేకపోయాను. ఆధ్యాత్మిక మార్గంలో ఆయన దగ్గరుండి, అన్నీ కనిపెట్టి, చేయిపట్టుకుని ముందుకు నడిపించిన లెక్కకు అందని ఎందరో శిష్యుల కోవలో నేను చేరలేకపోయాను.

దశాబ్దాల తరబడి గంటలకు గంటలు ఆయనతో లోకంలోని, లోకం వెలుపలి ఎన్నో విషయాలు ఆత్మీయంగా ముచ్చటించగలిగాను. కనుక నాకు ఆత్మీయుడా? ఎల్లప్పుడూ వారి కుటుంబంలో ఒకరిగానే నన్ను, నా కుటుంబాన్ని చూశారు కనుక... వారి కుటుంబ సభ్యులతో సమానంగా ఆదరించి, పెట్టుపోతల మర్యాదలూ చేశారు కాబట్టి ఆయన నాకు ఆప్త బంధువా? నాకు తండ్రిలేని లోటును తీర్చి, అచ్చం కన్నతండ్రిలాగే మా బాగోగులు చూసి... పిల్లల చదువుల నుంచి ఉద్యోగాల వరకూ, ఆరోగ్య సమస్యల నుంచి వ్యక్తిగత కష్టసుఖాల వరకూ ప్రతిదీ గమనించి... ఎప్పటికప్పుడు



భీమిలి ఆనందవనంలోని ఆద్యాది శ్రీమహాలక్ష్మి ఆలయం

కౌన్సిలింగు చేసి... కర్తవ్యం నిర్దేశించి... అవసరమైనప్పుడు మందలించి, విసుక్కుని, చిరాకుపడి, కనుచూపుతోనే భయపెట్టి, దారి చూపించి... భారమంతా తనపై వేసుకుని మా అందరినీ నిశ్చింతగా నడిపించారు కనుక ఆయన నాకు తండ్రా? పిల్లలు ఏ చదువు చదవాలి, ఎవరిని పెళ్లి చేసుకోవాలి, పెళ్లి ఎప్పుడు చేయాలి, ఆ పెళ్లి విందులో మెనూ ఏమిటి, కార్యక్రమం ఎలా ఉండాలి... వగైరా నిర్ణయాలన్నీ తానే చేసి, ప్రతిదీ దివ్యంగా జరిపించారు కాబట్టి మా ఇంటి పెద్దా? ఇంట్లో ఎవరికైనా జబ్బు చేసి బెంబేలు పడితే తాను ఎక్కడున్నా ఫోన్ చేసి చెయ్యగానే అందుబాటులోకి వచ్చి, అభయమిచ్చి, జబ్బేమిటో, చికిత్స ఏమిటో డాక్టర్ల కంటే బాగా వివరించి, మాటిమాటికీ తానే ఫోన్ చేయించి కుశలం కనుక్కుంటూ, చేయి పట్టుకుని మృత్యుముఖం నుంచి వెనక్కి తీసుకువచ్చిన సందర్భాలను బట్టి ఆయన మా రక్షకుడా? ఇలవేల్పా?


**ఇప్పుడు ఆయన లేరు. ఆయన సమాధి మందిరం ఉంది. ఆయన స్వయంగా కట్టించిన మహాలక్ష్మి ఆలయం ఉంది. ఆయనే నడయాడిన గురుధామాలున్నాయి. ఆయన పాదస్పర్శతో పునీతమైన ఆనందవనం ఉంది.**

కొంచెం... కొంచెం... మొత్తానికి అన్నీ! ఆయనే అన్నీ.

ఏదైనా అవునంటే ఔను. కాదంటే కాదు. సాధారణ లోక వ్యవహారం ప్రకారం ఆయన నాకు గురువా - అంటే కాదు! కాని - తన గురించి కొన్నేళ్లుగా వింటూ కూడా, అవకాశమున్నా చూడనిచ్చగించక... ఈ గురువులు నా ఒంటికి పడరని చెప్పి ఎవాయిడ్ చేస్తూ వచ్చిన నన్ను 23 ఏళ్ల కిందట తానే తన దగ్గరికి రప్పించుకుని... తప్పించుకు పోదామనుకున్నా పోనివ్వక తన దగ్గరే కూలేసి... ఉబుసుపోక కబుర్లు చెబుతున్నట్టే ఎన్నో రోజులు ఎన్నో గంటల తరబడి సంభాషించి... మనసుకు హత్తుకునేలా ధర్మం గురించి, దైవం గురించి ఎరుక పరిచి... నాకు తెలియకుండానే నన్ను ధర్మ మార్గానికి మరలించి... మళ్లీ ఆయన దగ్గరికి ఆ విషయాల గురించి పోవలసిన అవసరం రానంతగా సందేహ నివృత్తి కావించి... ఇన్ని గ్రంథాలు నా చేత, నా ద్వారా వెలువరింపజేసిన దేశికుడు, మార్గదర్శి నాకు గురువు కాక మరెవరు? దేని గురించి ఎన్ని ప్రశ్నలు వేసి, ఎంతలా ఇబ్బంది పెట్టినా నొచ్చుకోక, ఇష్టంగా ఓపికగా వివరంగా జవాబులు చెప్పిన మహానుభావుడిని మించిన గురువెవరు?



అలాగే ఆయన దేవుడు అంటే నేను నమ్మను. కాని జాగేశ్వర్‌లో (?) అర్ధరాత్రి గుడి పూజారికి శివుడిలా సాక్షాత్కరించిన వాడు... కురుక్షేత్రంలో గీతాబోధ జరిగిన చోట నిలబడి 'ఇక్కడే అంతా చెప్పాను' అని పలికినవాడు... అయోధ్య శిథిలాల ఎదుట గోడకు చేరగిలబడి 'ఆరు వేల ఏళ్లుగా చూస్తున్నా' అని నాతో నిర్వేదంగా అన్నవాడు దేవుడో, దేవసమానుడో, కనీసం దైవాంశ సంభూతుడో కాడా? అత్యంత సన్నిహితులైన అంతేవాసులకు కలిగిన ఎన్నో దివ్యానుభవాలను వింటే ఆయన సాక్షాత్తూ శివుడే అన్న అభిప్రాయం కలగదా?



గురువుగారు ఉన్నంతకాలమూ కాలండర్ ఆయన చుట్టూనే తిరిగేది. ఫిబ్రవరి వరంగల్‌లో మహాశివరాత్రి మొదలుకుని డిసెంబరులో బర్త్‌డే ఫంక్షన్, ఆ వెంటనే అవార్డుల వేడుక వరకూ ఎన్నో ఉత్సవాలు. ఆనంద వనం, విశాఖపట్నం, వరంగల్, బలుసుపాడు, హైదరాబాదు టివోలీ గార్డెన్ల చుట్టూ తిరగడంతో సంవత్సరమంతా సంబరంగా గడిచిపోయేది. గురువుగారు ఎక్కడున్నారు, ఎప్పుడొస్తున్నారు, ఎన్నాళ్లుంటారు అని అడుగుతూ, రహస్య పాదపూజల కూపీలు లాగుతూ, దర్శనం ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుండటం మరపురాని నోస్టాల్జిక్ అనుభవం.

ఇప్పుడు ఆయన లేరు. ఆయన సమాధి మందిరం ఉంది. ఆయన స్వయంగా కట్టించిన మహాలక్ష్మి ఆలయం ఉంది. ఆయనే నడయాడిన గురుధామాలున్నాయి. ఆయన పాదస్పర్శతో పునీతమైన ఆనందవనం ఉంది. ఆయన స్థాపించిన సంస్థలు, వాటికి ఆయన దిద్దిన ఒరవడులు, నిర్దేశించిన విధివిధానాలు ఉన్నాయి. వాటిలోనే ఆయనను చూసుకోవాలి మరి! ఇబ్బందే. కాని తప్పదు.

★